సాక్షి రంగారెడ్డి

గురువారం । 10 । జూలై । 2025



లేబర్ కోడ్‌లను..

కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. 8లో ▸



కుక్కల దాడిలో..

కుక్కల దాడిలో 21 గొర్రెలు మృతి చెందిన ఘటన చౌలపల్లిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. 8లో ▸



విద్యారంగ సమస్యలపై..

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ అలుపెరగని పోరాటం చేస్తోందని తెలంగాణ సహ సంఘటన మంత్రి విష్ణు అన్నారు. 8లో ▸

నేడు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశంతో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆయా వార్డుల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



అంశం: మున్సిపల్ పరిధిలో సమస్యలు
మున్సిపాలిటీ: చేవెళ్ల
కమిషనర్: ఎస్.వెంకటేశం
తేదీ: 10-7-2025 (గురువారం)
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73311 13243, 98665 07624

రేపు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎ.యోగేశ్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆయా వార్డుల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



అంశం: మున్సిపల్ పరిధిలోని సమస్యలు
మున్సిపాలిటీ: శంకర్‌పల్లి
కమిషనర్: ఎ. యోగేశ్
తేదీ: 11- 07- 2025(శుక్రవారం)
సమయం: ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73311 27776, 96764 84485

న్యూస్‌రీల్

భూములు లాక్కోవడం అన్యాయం

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

మొయినాబాద్: గోశాల ఏర్పాటుకు పేదల సాగు భూములను లాక్కోవడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. ఎనికేపల్లిలో రైతుల నిరసన కార్యక్రమానికి సీపీఐ నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోశాల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను కేటాయించాలని.. పేదల భూములు లాక్కోవడం సరికాదన్నారు. తప్పనిసరి అయితే న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, అంజయ్య, సుధీర్, మోహన్ రెడ్డి, శ్యామ్, యాదగిరి, ప్రభాకర్, నరేందర్ తదితరులు ఉన్నారు. అనంతరం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు లక్ష్మీపతియాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పార్టీ ఆధ్వర్యంలో నిరసనకు మద్దతిచ్చారు.

తెలంగాణ రవాణా శాఖ దేశానికే ఆదర్శం

మంత్రి పొన్నం ప్రభాకర్

బండ్లగూడ: రవాణా శాఖలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా 96 మంది 4 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రవాణా శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీలో ఇటీవల సీఎన్జీ బస్సులను తీసుకొచ్చామని, ఎలక్ట్రికల్ బస్సులను కూడా ప్రవేశపెడతామని తెలిపారు. ప్రమాదాల నివారణకు ఏఎంవీఐలు కృషి చేయాలని మంత్రి సూచించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన నేహా, మహమ్మద్ రఫీ, నబితలకు అవార్డులను బహూకరించారు.

మూగ వేదన | అరణ్య రోదన!

మందులు అరకొరే!

- మూడేళ్లుగా సరఫరా కాని నట్టల నివారణ మందులు
- లంపీస్కిన్ వ్యాధికి.. గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్
- సగం మందులతోనే సరి.. ఇండెంట్ పెట్టినా ఇవ్వని వైనం
- ప్రైవేటుకు రైతుల పరుగులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పశువైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశువుల నిష్పత్తి మేరకు మందులు సరఫరా చేయకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రైతులు తమ పశువులను తీసుకుని ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. సాధారణంగా పశువులు, గొర్రెలకు వైరస్, బ్యాక్టీరియా కారణంగా (కౌఫాక్స్, నీలినాలుక, గాలికుంటు, క్షయ, ఆంథ్రాక్స్, బ్లాక్ క్వార్టర్ (బ్లాక్ లెగ్), జోన్స్ డిసీజ్, ఫౌల్ టైఫాయిడ్, మాస్టిస్, బ్రూసిల్లోసిస్(బాంగ్స్‌వ్యాధి, ఫుట్ రాట్) వంటి వ్యాధులు వస్తుంటాయి. సీజన్ల వారీగా వచ్చే జబ్బులను ముందే గుర్తించి, వ్యాధి నిరోధక టీకా వేయించాల్సి ఉంటుంది. నట్టల నివారణ మందును తాగించాల్సి ఉంది. కానీ మూడేళ్లుగా నట్టల నివారణ మందు సరఫరా కావడం లేదు. గొర్రెలు, మేకల రైతులే వాటిని సమకూర్చుకోవాల్సి వస్తోంది.

పది నెలలుగా నిలిచిన సరఫరా

పశు వైద్యుడు అందుబాటులో ఉన్న పశువైద్యశాలకు రూ.60 వేల విలువ చేసే 69 రకాల మందులు, అదే పూర్తిస్థాయి వైద్యుడు లేని ఒక్కో సబ్ సెంటర్‌కు రూ.40 వేల విలువ చేసే మందులు ప్రతీ మూడు మాసాలకోసారి సరఫరా చేయాల్సి ఉంది. చివరిసారిగా 2024 సెప్టెంబర్‌లో మందులు సరఫరా చేశారు. దీంతో సబ్‌సెంటర్లకు పంపిణీ చేయాల్సిన మందులను పశువైద్యుడు పని చేస్తున్న చోటే వినియోగిస్తున్నారు. అది కూడా వచ్చిన పశువులకు సగం సగం మందులతోనే సరిపెడుతున్నారు. పెన్సిలిన్, యాంటిబయాటిక్స్, పశువులకు ప్రథమ చికిత్స చేసేందుకు అవసరమైన సర్జికల్ స్పిరిట్ కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 87 సబ్‌సెంటర్లు ఉండగా, వీటిలో ఏ ఒక్క చోట మందులు లేవంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

మృత్యువాత పడుతున్న దూడలు

సాధారణంగా పశువుల్లో సీజన్‌తో సంబంధం లేకుండా 'లంపీస్కిన్'వ్యాధి (ముద్ద చర్మవ్యాధి) సోకుతుంది. ఇప్పటి వరకు ఈ వ్యాధి నియంత్రణకు సరైన వ్యాక్సిన్ అందుబాటులోకి రాలేదు. ప్రత్యామ్నాయం లేక మేకలకు వాడే 'గోట్‌ఫాక్స్' వ్యాక్సిన్‌నే పశువులకు ఇస్తున్నారు. ఇది ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాప్తి చెందుతుంది. తెల్ల జాతి ఆవుల్లో ఎక్కువగా కన్పిస్తుంది. శరీరమంతా కురుపులు, నల్లని మచ్చలతో కన్పిస్తుంది. ఈ సమయంలో జ్వరం అధికంగా ఉంటుంది. వ్యాధి ముదిరితే పశువు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఆవులకు వ్యాక్సిన్ వేయడం వల్ల అవి ప్రమాదం నుంచి బయటపడుతున్నాయి. కానీ వాటికి పుట్టిన దూడలు మాత్రం చనిపోతున్నాయి.

నట్టల నివారణకు మందు కరువే

మూడేళ్లుగా నట్టల నివారణ మందు సరఫరా కావడం లేదు. అనారోగ్యంతో బాధపడుతున్న జీవాలను కాపాడుకునేందుకు రైతులు ప్రైవేటుగా మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గొర్రెలు, మేకలకు గతంలో ఏటా నాలుగు సార్లు నట్టల నివారణ మందులు సరఫరా చేసేది. మూడేళ్లుగా సరఫరా నిలిచిపోయింది. సీజన్‌కు ముందు వ్యాక్సిన్ వేసి, నట్టల మందు తాగిస్తే జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి. వ్యాక్సిన్ వేసినా.. నట్టల మందు తాగించకపోవడంతో జీవాలు జబ్బుబారిన పడుతుంటాయి. ఆవులు, దూడలకు టాబ్లెట్స్ ఇస్తున్నారు కానీ గొర్రెలు, మేకలకు ఇవ్వడం లేదు. మార్కెట్లో లీటరు రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

వేధిస్తున్న వైద్యనిపుణుల కొరత

మూగజీవాలకు సత్వర వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం జిల్లాలో నాలుగు ఏరియా వెటర్నరీ, 46 ప్రాథమిక పశు వైద్యశాలలు, ఐదు మొబైల్ క్లినిక్స్ సహా మరో 87 సబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. కొత్తూరు, కనకమామిడి (వైద్యులు లీవ్‌లో వెళ్లగా), మేకగూడ, ఆరుట్ల, కందుకూరు వైద్యులు (ఇన్‌సర్వీసు పీజీకి వెళ్లారు). పాల్మాకుల, ఇర్విన్‌లో వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమీప సెంటర్లలో పని చేస్తున్న వైద్యులు సేవలు అందిస్తున్నారు. వెటర్నరీ అసిస్టెంట్లకు ఇటీవల పదోన్నతులు కల్పించడంతో ఆయా పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం మెజార్టీ కేంద్రాల్లో వైద్యులకు సహాయకులు లేరు. అటెండర్లు లేని చోట వైద్యులే ఆ పని కూడా చేయాల్సిన దుస్థితి. సిబ్బంది కొరతతో నిర్దేశిత సమయంలో వ్యాక్సిన్లు వేయలేని పరిస్థితి.



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డితో కలిసి నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఆక్రమణలను తొలగిస్తాం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి మాసబ్‌చెరువు నాలా పరిశీలన

తుర్కయంజాల్: ఆక్రమణలను తొలగించి మాసబ్ చెరువు నాలాను పునరుద్ధరిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తుర్కయంజాల్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని.. ఇప్పుడే నాలా ఆక్రమణలు తొలగిస్తే భవిష్యత్ ఇబ్బందులు తలెత్తవన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. ఇరిగేషన్, రెవెన్యూ, శాటిలైట్ మ్యాప్‌లను పరిశీలించి నాలా వెడల్పును శాస్త్రీయంగా నిర్ధారించుకున్న తరువాత పూడికతీత పనులను చేపడుతామన్నారు. ఇప్పటికే తుర్కయంజాల్–ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు, పెద్ద అంబర్‌పేటలోని ఈదుల చెరువు వరకు ఉన్న ఏడున్నర కిలోమీటర్ల నాలాను డ్రోన్ సాయంతో పరిశీలించామని చెప్పారు. ఈ సర్వేలో పలు చోట్ల నాలా వెడల్పు, మరికొన్ని చోట్ల లోతు తగ్గినట్లు గుర్తించామని వెల్లడించారు. మాసబ్ చెరువు నాలా పూడికతీత పనులను ఒక మోడల్‌గా ఎంచుకుని చేపడుతామని, నివాస ప్రాంతాలకు మినహాయింపు ఇచ్చి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ చెన్నకేశవ రెడ్డి, ఏఈ వంశీ, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సన్మానం

షాద్‌నగర్: కేంద్ర మంత్రి జయంత్‌కుమార్ చౌదరిని బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని వినియోగించుకోకపోవడంతో ఎంతో మంది నష్టపోయారని తెలిపారు.



కేంద్ర మంత్రి జయంత్‌కుమార్ చౌదరిని సన్మానిస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి



ప్లాట్ల కేటాయింపులో పాల్గొన్న ఆర్డీఓ తదితరులు

181 గజాల ప్లాట్లకు ముగిసిన లాటరీ

నేడు 242, 302 గజాలకు

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన ఫార్మా లేఅవుట్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల పంపిణీ బుధవారం కొనసాగింది. మూడో రోజు 181 గజాల ప్లాట్లను ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించారు. మొత్తం 581 మందికి గాను 340 మంది లాటరీలో పాల్గొన్నారు. కాగా గురువారం అన్ని గ్రామాలకు సంబంధించి 242 గజాలు మరియు 302 గజాలకు సంబంధించిన ప్లాట్లకు లాటరీ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు 242 గజాల ప్లాట్లకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 302 గజాల ప్లాట్లకు లాటరీ నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కమిటీ సభ్యులు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 26వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలో 22 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరిలో 90 శాతం విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలలకు దూరంగా నివాసం ఉంటున్నారని, ప్రతీ ప్రభుత్వ, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ 30 మందికి ఒక బస్సు ఏర్పాటు చేసి బడికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లాలయ్య ముదిరాజ్, రాజు ముదిరాజ్, భవాని శేఖర్, రవీందర్ పాల్గొన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ

శంకర్‌పల్లి: ఎన్నికలు నిర్వహణకు సిద్ధంగా ఉండాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా బూత్ లెవల్ అధికారులకు ఫారం 6,7,8లకు సంబంధించి వ్యూరిఫికేషన్, అప్లికేషన్‌ను ఏ విధంగా ఉపయోగించాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్‌గా జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు వ్యవహరించగా, బాలాజీ, ఆశీర్వాదం, షేక్ మహ్మద్ రోషన్‌లు మాస్టర్ ట్రైనర్లుగా ఉన్నారు. వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మండలం, పట్టణంలో మొత్తం ఆరుగురు సూపర్‌వైజర్లు, 69 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎన్నికల సమయంలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని, వారికిచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, వివరాలను అందులో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

ఫార్మా ప్లాట్లు

2,200 ఎకరాలు సర్కార్ స్వాధీనంలోనే!

- అథారిటీలో పరిహారం తీసుకోండి.. లేదంటే కోట్లాడి మరింత పెంచుకోండి
- ప్లాట్ల లాటరీల లిస్టులో 700 మంది రైతులు పేర్లు
- ఆందోళన చెందుతున్న కర్షకులు

యాచారం: గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు సేకరించిన భూములకు కాంగ్రెస్ సర్కార్ ఈ నెల 7 నుంచి లాటరీ విధానంలో ప్లాట్ల పట్టాలిస్తోంది. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 700 మందికి పైగా రైతులు తమ పట్టాభూమి ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో అధికారులు 2,200 ఎకరాల పట్టా భూమికి అవార్డులు పాస్ చేసి పరిహారాన్ని అథారిటీలో జమచేశారు. భూ రికార్డులను టీజీఐఐసీ పేరిట మార్చేశారు. రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో రైతుల పేరిట భూ రికార్డులు మార్చి రైతు భరోసా, బ్యాంకు రుణాలు, రుణమాఫీ వర్తింప చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. రైతులు తమకు న్యాయం చేయాలంటూ సీసీఎల్ఏ, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రస్తుతం ప్లాట్లు కేటాయిస్తున్నామని రైతులు లాటరీలో పాల్గొనాలని అధికారులు ఆయా గ్రామ పంచాయతీల్లో లిస్టులు ఏర్పాటు చేశారు. ఇది చూసిన రైతులు తమ ప్రమేయం లేకుండానే భూ రికార్డులు మార్చి తమ పట్టాభూములు గుంజుకుంటున్నారని ఆందోళన చెందుతున్నారు.

పరిహారం పెంపునకు ఓకే

నిబంధనల ప్రకారం నాలుగు గ్రామాల్లోని 2,200 ఎకరాల పట్టాభూములు టీజీఐఐసీ ఆధీనంలోనే ఉన్నాయి. రైతులు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా రికార్డులు మార్చడం కుదరదు. పరిహారం పెంచే అవకాశం మాత్రమే ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. రైతులు అనుకూలంగా ఉంటే వారితో సంప్రదింపులు జరిపి ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.50లక్షల లోపు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇందుకు రైతులు నిరాకరించడంతో పాటు అధికారులు సైతం తమ వైఖరి మార్చుకోవడం లేదు.

లిస్ట్‌లో 150 మంది పేర్లు

అథారిటీలో పరిహారాన్ని జమ చేసిన రైతులకు ఎకరాకు 121 గజాల చొప్పున ఫార్మా ప్లాట్లు కేటాయించారు. 700 మందికి పైగా రైతులకు భూరికార్డుల్లో ఉన్న ఎకరాలను బట్టి ఫార్మా ప్లాట్లను కేటాయించి లాటరీ లిస్టుల్లో పేర్లను ప్రకటిస్తున్నారు. రైతులు మాత్రం మేము భూములే ఇవ్వలేదు.. ప్లాట్లు మాకెందుకని తిరస్కరిస్తున్నారు. అధికారులు ఈ నెల 7వ తేదీ నుంచి రైతుల పేర్లను ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించి లాటరీలో పాల్గొనాలని మీకు కేటాయించిన ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచిస్తున్నారు.



ప్లాట్ల లాటరీ లిస్టులో మర్లకుంటతండాకు చెందిన ఇస్లావత్ రాజు పేరు

ప్లాట్లను తీసుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులొస్తాయని అధికారులు చెబుతున్నారు. ఫార్మాకు మేము పట్టా భూములు ఇవ్వలేదు, మాకు ప్లాట్లు వద్దని, లాటరీ లిస్టుల్లో తమ పేర్లు తొలగించాలంటూ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. కుర్మిద్ద అనుబంధ గిరిజన తండాలైన మర్లకుంట, మంగలిగడ్డ, పోతుబండ తండాలకు చెందిన 150 మంది రైతులకు చెందిన 200 ఎకరాల పట్టా భూమికి మొత్తం లాటరీ లిస్టుల్లో పేర్లొచ్చాయి.



లాటరీ లిస్టుల్లోంచి తమ పేర్లు తొలగించాలని ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న పట్టా భూముల రైతులు

ఇది అన్యాయం



ఫార్మాకు మా భూములు ఇవ్వలేదు, ప్లాట్ల లాటరీ లిస్టుల్లో మాత్రం పేర్లు వచ్చాయి. సర్వేనంబరు 273, 275, 284లో ఐదెకరాలకు పైగా పట్టా భూమిని ఫార్మాకు ఇచ్చేసినట్లు లాటరీ లిస్టుల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు ప్రకటిస్తున్నారు. ఇది అన్యాయం. మేం ఎలా బతకాలి.

– ఇస్లావత్ రాజు, మర్లకుంట తండా

లిస్టులో పేర్లు



ఫార్మాకు పట్టా భూములు ఇవ్వకుండానే ప్లాట్ల లాటరీ లిస్టుల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు ప్రకటిస్తున్నారు. 55, 60, 63, 65 తదితర సర్వేనంబర్లల్లో మా కుటుంబ సభ్యులకు చెందిన 50 ఎకరాలకు పైగా పట్టా భూమి ఉంది. మేము ఫార్మాకు పట్టా భూములు ఇవ్వలేదు. కాని లాటరీ లిస్టుల్లో మా కుటుంబ సభ్యులు పేర్లు ప్రకటిస్తున్నారు.

– ముత్యాల వెంకట్‌రెడ్డి, రైతు, నానక్‌నగర్

రైతుల ఇష్టం



అథారిటీలో పరిహారాన్ని జమ చేసిన రైతులకు ప్లాట్లు కేటాయించాం. లాటరీ లిస్టుల్లోనూ నిత్యం పేర్లు ప్రకటిస్తున్నాం. లాటరీలో పాల్గొనేది లేనిది వారిష్టం. అథారిటీలో జమ చేసిన పరిహారాన్ని తీసుకుంటారా.. లేక మరింత పెంచమంటారా అనేది వారి అభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుంది. రికార్డులు మారిన భూములన్నీ టీజీఐఐసీ ఆధీనంలో ఉన్నట్లే.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

నిద్రలోనే మృత్యు ఒడికి

మొయినాబాద్: తలనొప్పిగా ఉందని టాబ్లెట్ వేసుకుని, కుర్చీలో కునుకు తీసిన ఓ వ్యక్తి నిద్రలోనే మరణించాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండలం వట్టి నాగులపల్లికి చెందిన గోలియా శ్యామ్ సుందర్ సింగ్(55) నాగిరెడ్డిగూడ రెవెన్యూలోని సుజాత స్కూల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తలనొప్పిగా ఉందని టాబ్లెట్ వేసుకుని కుర్చీలో నిద్రపోయాడు. కొంత సేపటి తర్వాత తోటి ఉద్యోగులు నిద్రలేపే ప్రయత్నం చేయగా లేవ లేదు. వెంటనే భాస్కర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కదులుతున్న కారు నుంచి మంటలు



మంటలకు దగ్ధమవుతున్న కారు

కేశంపేట: కదులుతున్న వాహనంలో మంటలు వ్యాపించి ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లికి చెందిన మిద్దె కృష్ణయ్య తన షిఫ్ట్ డిజైర్ కారులో పాపిరెడ్డిగూడ శివారు నుంచి వెంచర్ రోడ్డులో స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కారు ఇంజిన్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన కృష్ణయ్య వెంటనే కారు నుంచి దిగి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో షాద్‌నగర్ నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్ మంటలార్పేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

జీహెచ్ఎంసీ కార్యాలయంలో బోనాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలోని అమ్మవారి దేవాలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



సమ్మెలో పాల్గొన్న జర్నలిస్టులు, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం సార్వత్రిక సమ్మెను నిర్వహించారు. ఈ సమ్మెకు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, టీడబ్ల్యూజేఎఫ్, రైతుసంఘం, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపల్, జీపీ వర్కర్లు, ప్రజాసంఘాలు సమ్మెకు పూర్తి మద్దతు తెలిపాయి. సమ్మెలో భాగంగా ఎంపీడీఓ కార్యా లయం నుంచి రైల్వేస్టేషన్, మెయిన్‌రోడ్డు, ముఖ్యకూడలి మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్మికవర్గం సమరశీల పోరాటాలద్వారా వందేళ్లలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలను వెల్లదీస్తున్న కార్మికులకు కనీస వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఖాజాపాషా, రాఘవేందర్‌గౌడ్, రమేష్‌కుమార్, నర్సింహారెడ్డి, నరేశ్, సీనయ్య, వెంకట య్య, నాయకులు రాజు, శ్రీనునాయక్, నర్సింలు గౌడ్, సాయిబాబు, ఈశ్వర్‌నాయక్, జయమ్మ, మల్లేశ్, జైపాల్‌రెడ్డి, గణేశ్, మల్లేశ్, సత్యం, కోటేశ్వర్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్స్@రూ.11.43 కోట్లు

ఇందిరమ్మ క్యాంటీన్లలో అమలు

- కంటైనర్ల కొనుగోళ్లు, 11 క్యాంటీన్ల ఆధునికీకరణ
- నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ క్యాంటీన్లలో టిఫిన్ అమలుకు అవసరమైన ఏర్పాట్ల కోసం జీహెచ్ఎంసీకి దాదాపు రూ.11.43 కోట్లు ఖర్చు కానుంది. గతంలో అన్నపూర్ణ కేంద్రాలుగా ఉన్న రూ.5కే భోజన సదుపాయాల కేంద్రాల పేర్లను ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చడంతో పాటు మధ్యాహ్నం భోజనంతో పాటు ఉదయం పూట టిఫిన్‌ను కూడా రూ.5కే అందించేందుకు ఇటీవల స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిఫిన్ సదుపాయం కల్పించేందుకు క్యాంటీన్లకు అవసరమైన కంటైనర్ల కొనుగోళ్లకు, 11 క్యాంటీన్లకు బ్రాండింగ్ చేసేందుకు దాదాపు రూ.11,43, 05,000 ఖర్చు కానుంది. ఈ మొత్తాన్ని ఒకే పర్యాయం కాకుండా మూడు విడతలుగా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిపాదనల్ని గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ ముందుంచుతున్నారు. ఆమోదానంతరం అమలు చర్యలు చేపట్టనున్నారు.

ప్రతిపాదనలు ఇలా..

- ఒక్కో కంటైనర్‌కు (10X40 అడుగులు) రూ. 10 లక్షల వంతున 60 కంటైనర్లకు రూ. 6 కోట్లు.
- ఒక్కో కంటైనర్‌కు (10X20 అడుగులు)రూ.6.70 లక్షల చొప్పున79కంటైనర్లకు రూ.5,29,30,000
- ప్రస్తుతమున్న క్యాంటీన్లలో 11 క్యాంటీన్లను బ్రాండింగ్‌తో ఆధునికీకరించేందుకు ఒక్కోదానికి రూ.1.25 లక్షల వంతున రూ.13.75 లక్షలు
- మొత్తం రూ. 11,43,05,000.

124 కేంద్రాలు..

హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా జీహెచ్ఎంసీ రూ. 5కే భోజనం అందజేస్తోంది. టిఫిన్ కూడా రూ.5కే అందించనుంది. ఒక్కో టిఫిన్‌కు రూ.19 ఖర్చు కానుండగా, మిగతా రూ.14 ప్రభుత్వం భరించనుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో 124 కేంద్రాల ద్వారా రోజూ దాదాపు 30వేల మందికి ప్రయోజనం చేకూరుతోంది.

కుక్కల దాడిలో 21 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న బాబయ్య తదితరులు

- కేశంపేట మండలం చౌలపల్లిలో ఘటన
- బాధితుడికి రూ.2 లక్షల నష్టం

కేశంపేట: కుక్కల దాడిలో 21 గొర్రెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చౌలపల్లిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎలిగపల్లి కృష్ణయ్య గొర్రెల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలోని దొడ్లో జీవాలను తోలాడు. మంగళవారం రాత్రి కుక్కలు మూకుమ్మడిగా మందపై దాడి చేశాయి. ఈ ఘటనలో 21 జీవాలు చనిపోగా పలు తీవ్రంగా గాయపడ్డాయని బాధితుడు తెలిపాడు. సుమారు రూ.2 లక్షలు నష్టపోయానని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని కోరాడు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య చౌలపల్లిలోని రైతు పొలానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్లు రాధిక, నాయకులు పసుపుల ప్రశాంత్, రఘురాంగౌడ్, కృష్ణయ్య, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమోసాలో బల్లి!



మొయినాబాద్: స్వీట్ షాపులో సమోసాలు తిన్నవారికి దిమ్మతిరిగే షాక్ తగిలింది. సమోసాలో బల్లి దర్శనమివ్వడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మొయినాబాద్ మండలం తోలుకట్ట గేటు వద్ద కలకలం రేపింది. చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కుమార్ తన కూతురు సంజనతో కలిసి బుధవారం మొయినాబాద్‌లో కూరగాయలు విక్రయించడానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తూ మార్గ మధ్యలో తోలుకట్ట గేటు వద్ద స్వీట్ షాపులో సమోసాలు తీసుకుని, తింటుండగా అందులో బల్లి కనిపించింది. అప్పటికే రెండు సమోసాలు తిన్న వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అంతలోనే సంజన వాంతులు చేసుకోవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. స్వీట్ హౌస్ ఓనర్ షాపు మూసివేసి పారిపోయాడు. ఈ విషయమైన బాధితులు మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం

మొయినాబాద్: గురుకుల కళాశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మాదాపూర్‌కు చెందిన సున్నల్ పవన్(17) చిలుకూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారఉదయం టిఫిన్ చేసిన అనంతరం కళాశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో ప్రిన్సిపల్ దేవేందర్, అధ్యాపకులు మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



ఆవిర్భావ వేడుకల్లో ఏబీవీపీ నాయకులు

- ఏబీవీపీ తెలంగాణ ప్రాంత సహ సంఘటన మంత్రి విష్ణు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ సంఘం తెలంగాణ ప్రాంత సహ సంఘటన మంత్రి విష్ణు అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఏబీవీపీ నగర కార్యదర్శి నవీన్‌నాయక్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణు భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. దేశంకోసం, ధర్మంకోసం పని చేసే ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. దేశంలో భారతీయత, జాతీయ భావజాలం కలిగిన అతిపెద్ద విద్యార్థి సంఘంగా గుర్తింపు తెచ్చుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సందీప్, వంశీ, నవీన్, రాకేశ్, అఖి, సాయి, యశ్వంత్, పవన్, రామ్‌చరణ్, నందకోమల్, అమరేందర్‌రెడ్డి, రాకేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని.. భర్తను హత్య చేసిన భార్య



మహమ్మద్ సైఫ్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తుండడంతో భర్తను భార్య హతమార్చిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం..వట్టేపల్లి సైఫ్ కాలనీ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సైఫ్ (30), ఫరీదా సుల్తానాలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. ఫరీదా ప్రతిరోజు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. మద్యానికి బానిసైన మహమ్మద్ సైఫ్ ప్రతి రోజు భార్యను వేధిస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి వేధించగా..ఫరీదా కోపంతో బండరాయితో తలపై మోదడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకుని సుల్తానాను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

- కేశంపేట పీఎస్‌లో ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు




కీర్తన, సంజయ్, దీపిక (ఫైల్)

కేశంపేట: కుటుంబ కలహాలతో తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని లేమామిడి శివారులో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్జిల్ మండల పరిధిలోని డోకూరుకు చెందిన అర్కే శివలింగానికి కుర్మిద్దకు చెందిన దీపిక (25)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంజయ్‌కుమార్ (07), కీర్తన (05) సంతానం. శివలింగం ఉపాధి నిమిత్తం లేమామిడి శివారులోని వెంకో రీసెర్చ్ బ్రీడింగ్ ఫాంలో ఎనిమిది నెలల క్రితం పనికి కుదిరాడు. కుటుంబంతో కలిసి ఇక్కడే ఓ గదిలో జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా గత మంగళవారం ఉదయం దీపిక గుర్తు తెలియని వ్యక్తితో ఫోన్ మాట్లాడుతున్నట్లు గుర్తించిన శివలింగం ఆమెను మందలించడంతో పాటు చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన దీపిక తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్తున్నట్లు పొరుగువారికి చెప్పింది. మధ్యాహ్నం భోజన సమయంలో ఇంటికి వచ్చిన శివలింగానికి భార్యాపిల్లలు కనిపించకపోవడంతో పొరుగువారిని ఆరా తీశాడు. దీపిక పుట్టింటికి ఫోన్ చేసి అడగగా అక్కడికి రాలేదని చెప్పారు. బంధువులతో పాటు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.

కిలోన్నర ఎండు గంజాయి స్వాధీనం

ఇద్దరు వ్యక్తులకు రిమాండ్

హయత్‌నగర్: ఇద్దరు వ్యక్తుల నుంచి కిలోన్నర ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ షాపూర్‌నగర్‌కు చెందిన అన్నపూరి వెంకటేశ్, ఇబ్రహీంపట్నం అలిమియాకుంటకు చెందిన మహ్మద్ షోయబ్ పెద్దఅంబర్‌పేట్ ప్రాంతంలో గంజాయిని క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్ఓటీ, హయత్‌నగర్ పోలీసులు పెద్దఅంబర్‌పేట్‌లోని కేవీకే వాటర్ వాషింగ్ సెంటర్‌పై దాడి చేసి, గంజాయిని విక్రయిస్తున్న వెంకటేశ్‌ను, కొనేందుకు వచ్చిన మహ్మద్ వాజిద్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని విక్రయించేందుకు వచ్చిన మహ్మద్ షోయబ్, కొనేందుకు వచ్చిన మహ్మద్ మస్తాన్‌వలి తప్పించుకున్నారు. వెంకటేశ్‌పై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి కిలోన్నర ఎండు గంజాయి, బైకు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

బదిలీల తర్వాతే ప్రమోషన్లు ఇవ్వాలి

ఆమనగల్లు: ఉపాధ్యాయుల బదిలీ తర్వాతే ప్రమోషన్లు ఇవ్వాలని గెజిటెడ్ హెడ్ మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల బదిలీల తర్వాత ప్రమోషన్లు ఇస్తేనే న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గుర్తు తెలియని మహిళ మృతి

షాద్‌నగర్ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న మహిళ(60)ను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణం వదిలింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలు ఆరా తీయగా ఎలాంటి ఫలితం కనిపించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలు పసుపు రంగు చీర, గులాబీ రంగు జాకెట్ ధరించి ఉంది. జాతీయ రహదారి చుట్టు పక్క ప్రాంతాల్లో భిక్షాటన చేసే మహిళ కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ లభించినా, వివరాలు తెలిసినా వెంటనే 8712568282, 8712663329 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆ స్థలాన్ని వదులుకునేది లేదు

ఉప్పల్ క్రికెట్ స్టేడియం గేట్ల వద్ద ప్రైవేట్ సంస్థ ప్రహరీ నిర్మాణం

- స్టేడియం గేట్లకు గోడలు అడ్డుగా ఉన్నాయని తొలగింపు
- ఘటనా స్థలానికి చేరుకున్న వీహెచ్, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్
- సదరు భూమిని కాపాడుకుంటామన్న కాంగ్రెస్, బీజేపీ నేతలు
- నాటకీయ పరిణామాల మధ్య ప్రహరీ కూల్చివేతలు



క్రికెట్ స్టేడియం వద్ద గేట్లకు అడ్డుగా నిర్మించిన ప్రహరీని తొలగిస్తున్న ఐలా సిబ్బంది

ఉప్పల్: నగరంలోని ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద బుధవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. క్రికెట్ స్టేడియం వద్ద ఓ ప్రైవేట్ సంస్థ ప్రహరీ నిర్మించి గేట్లు మూసివేశారన్న సమాచారంతో మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డితో కలిసి ఉదయమే తన అనుచరులతో స్టేడియం ఆవరణలోకి వచ్చారు. ఉప్పల్ ఐలా అధికారులకు సమాచారం ఇచ్చారు. నిర్మించిన ప్రహరీని వెంటనే తొలగించాలని చెప్పడంతో ఐలా మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గేట్లకు అడ్డుగా ఉన్న ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. ఉప్పల్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుతోనే ఈ ప్రాంతానికి గుర్తింపు వచ్చిందని, స్థలాన్ని పోనివ్వమన్నారు. ప్రహరీని పూర్తిగా తొలగించే వరకు ఆయన అక్కడే బైఠాయించారు. స్వయంగా జేసీబీని తెప్పించి ప్రహరీని పూర్తిగా తొలగించే ప్రయత్నం చేయించడంతో పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత ఐలా ఆధ్వర్యంలో పూర్తిగా తొలగించడంతో వీహెచ్ అక్కడినుంచి అనుచరులతో కలిసి వెళ్లిపోయారు. కాగా.. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు స్థలం ఐలా ఆధీనంలోనే ఉందని, ఎలాంటి సంస్థకు అప్పగించ లేదన్నారు.

అందుకే కూల్చివేశాం..

ఉప్పల్ ఐలా కమిషనర్ ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ.. సదరు స్థలం కోర్టు వివాదంలో ఉందన్నారు. ప్రస్తుతం అది ఐలా అధీనంలోనే ఉందని తెలిపారు. ప్రహరీ, స్టేడియం గేట్ల ముందు నిర్మించిన వాటికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతోనే కూల్చివేస్తున్నామన్నారు.

ఎందుకీ స్థల వివాదం?

ఉప్పల్ ప్రధాన రహదారిపై కొంత పారిశ్రామిక వాడ స్థలం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇతరులతో పాటు పెంగ్విన్ టెక్స్‌టైల్స్‌కు కలిపి 46 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అందులో కొన్నాళ్లు పరిశ్రమ నడిపించిన సంస్థ లాకౌట్ చేసి వెళ్లిపోయింది. పరిశ్రమ నెలకొల్పే సమయంలో బ్యాంక్ నుంచి రుణాలు పొందింది. లాకౌట్ కారణంగా రుణం ఇచ్చిన బ్యాంకు సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఇందులో నుంచి 16 ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వ చొరవతో ఏపీఐఐసీ ఉప్పల్ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కేటాయించింది. స్టేడియం నిర్మాణ సమయంలోనే అదనంగా 7 ఎకరాల 20 గుంటల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టింది. కాగా.. అది కూడా వివాదం కావడంతో పెద్దల సమక్షంలో నిర్ణయం తీసుకుని రెగ్యులరైజ్ చేయించినట్లు సమాచారం. మిగిలిన 22.5 ఎకరాల స్థలాన్ని ఓ ప్రైవేట్ సంస్థ వేలం ద్వారా దక్కించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం.



ఘటనా స్థలంలో వీహెచ్ తదితరులు